క్లుప్తంగా

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష



పార్టీలో చేరిన వారితో జెడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజ్

బోనకల్: సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో వివిధ పార్టీల నుంచి 15 కుటుంబాలు జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంచర్ల బాబు, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, కొండ పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు రూ.10 కోట్లు మంజూరు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. టేకులపల్లి నుంచి కొర్లగూడెంకు రూ.4.50 కోట్లు, లంకపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గుర్వాయిగూడెం మీదుగా కిష్టారం వరకు రూ.2 కోట్లు, మండాలపాడు నుంచి మొండికుంట వరకు రూ.1.50 కోట్లు, గంగారం నుంచి సత్యనారాయణపురానికి రోడ్డు నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

మరోమారు గెలిపించాలి



ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం చేపట్టింది. బుధవారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు రాధిక బాబీలు 15, 3వ వార్డులలో తిరుగుతూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఎమ్మెల్యే సండ్రను మరోమారు గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వాసు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, అంకమరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కొణిజర్ల: మండలంలోని తుమ్మలపల్లిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా పీసీసీ సభ్యుడు మాళోత్ రాందాస్ నాయక్, స్థానిక సర్పంచ్ రేణుకతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్, సునీల్‌రెడ్డి, గోపి పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన బీఆర్ఎస్..

ఏన్కూరు: ఎన్నికలలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరిస్తుందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని ఎర్రబోడుతండలో బుధవారం ఇంటింటికీ ఇందిరమ్మ సారే పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

వినతుల వెల్లువ

కలెక్టర్‌కు వినతి..

వైరా: వైరా రిజర్వాయర్‌ను రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమణలు తొలగించాలని బుధవారం అఖిలపక్షం నాయకులు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. 100 అడుగులు ఉండాల్సిన రోడ్డును అక్రమకారులు ఆక్రమించుకున్నా.. అధికారులు తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ రిజర్వాయర్ రోడ్డు అక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించి కోటి రూపాయల నగదుతో రోడ్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాంబాబు, అర్జున్‌రావు, గోపాలరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

పెనుబల్లి : ధరణి సేవలను మీసేవ ద్వారానే ఇవ్వాలని మండల మీసేవా నిర్వాహకులు తహసీల్‌లో వినతిపత్రం అందించారు. తెలంగాణ రాష్ట్రంలో మీ సేవ నిర్వాహకులకు కమీషన్ పెంచాలని, రేషన్ కార్డు సర్వీసులను పునరుద్ధరించాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. కార్యక్రమంలో మండలం మీసేవ నిర్వాహకులు ఉషారాణి, వలీ, వెంకటరమణ, శివ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రామ్‌జీ తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో యాదవులకు రెండో విడత గొర్రెల యూనిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 12 యూనిట్ల ను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మ రెడ్డి, వెంకటనర్సయ వెంకటేశ్వర్లు, అచ్చయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలే!



మత్కేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద.. గుంతలమయంగా మారిన ఖమ్మం–బోనకల్ రహదారి

అస్తవ్యస్తంగా ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారి

- రోడ్డుపై నిత్యం ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చింతకాని: ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని పందిళ్లపల్లి గ్రామం నుంచి బోనకల్ వరకు ఉన్నటువంటి రహదారి పెద్దపెద్ద గోతులతో అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు నిత్యం పలు ప్రమాదాలకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతకాని మండలంలోని పందిళ్లపల్లి నుంచి నాగులవంచ గ్రామం వరకు ఉన్న రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటూ పలువురు మృత్యువాత పడటంతో పాటు పదుల సంఖ్యలో వాహనదారులు గాయపడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవటం లేదని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారి అనుకూలంగా ఉండదంతో..

ఖమ్మం నుంచి విజయవాడకు వెళ్లేందుకు ఈ రహదారి అనుకూలంగా ఉండటంతో ప్రతిరోజు వందలాది మంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. విజయవాడకు వెళ్లే వ్యాపారులతో పాటు చింతకాని మండలంతో పాటు మధిర, బోనకల్, మండలాలతో పాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన వాహనదారులు ఈ రహదారిపై ఖమ్మం నగరానికి వెళ్లేందుకు ప్రయాణాలు సాగిస్తుంటారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు..

అధికారులు, ప్రజాప్రతినిధులు ఖమ్మం నుంచి మధిర నియోజకవర్గానికి వెళ్లాలంటే ఈ రహదారి నుంచే ప్రయాణిస్తుంటారు. రహదారిపై పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదాలు జరుగుతున్నా.. అటు అధికారులు కానీ.. ఇటు ప్రజాప్రతినిధులు కానీ కనీస మరమ్మతులు చేపట్టడం లేదని ప్రజలు మండి పడుతున్నారు. ఈ రహదారి దుస్థితిపై పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం శూన్యం. ఇటీవల సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పందిళ్లపల్లి గ్రామం నుంచి నాగులవంచ వరకు పాదయాత్ర కూడా నిర్వహించడం జరిగింది. ఇకనైనా అధికారులు పట్టించుకోని రహదారికి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారి మరమ్మత్తుల కోసం ప్రభుత్వానికి రూ.4.50 కోట్లకు ప్రతిపాదనలు పంపాం. మరమ్మత్తు పనులకు ముందుగా రూ.3 కోట్లు మంజూరైనప్పటికీ మరమ్మతు పనులు చేపట్టేందుకు టెండర్లను పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మరో రూ.1.50 కోట్లు పెంచి ప్రతిపాదనలు పంపాం. రూ.15 లక్షలకు ప్యాచ్ వర్కులు చేయాల్సి ఉంది. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం.

– కె.లక్ష్మీనారాయణ, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ

ప్రయాణం అత్యంత ప్రమాదకరం..



ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారి గుంతలు పడి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం.. ఆశలు వదులుకోవడమే అన్నట్టుగా ఉంది. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు ప్రమాదాలకు గురవుతూ వాహనదారులు గాయపడుతున్నారు. పందిళ్లపల్లి నుంచి నాగులవంచ గ్రామం వరకు ప్రయాణించాలంటే ప్రాణసంకటంగా ఉంటుంది. ఇక రాత్రివేళల్లో అయితే నరక యాతన అనుభవించాల్సి వస్తుంది.

– కంచం కోటేశ్వరరావు, మత్కేపల్లి

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు..



ఖమ్మం–బోనకల్ రహదారిపై మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి గుండా ప్రయాణిస్తున్నప్పటికీ.. మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

– కాశిబోయిన శ్రీనివాసరావు, మత్కేపల్లి

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



చింతకాని : సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని/వేంసూరు: కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం చింతకాని మండలంలోని జగనాథపురం గ్రామంలో పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గంలో భట్టివిక్రమార్కను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. వేంసూరు మండలంలోని మొద్దులగూడెం బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంభాని మాట్లాడుతూ.. ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలతో బలంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్ట పడిన ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గోపి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భాస్కర్, మండల అధికార ప్రతినిధి కిషోర్, ఇతర నాయకులు నాగార్జున్, కొప్పుల గోవిందరావు, సట్టు వెంకటేశ్వర్లు, కందిమళ్ల వీరబాబు, కోటేశ్వరరావు, అజయ్, శ్రీనివాసరావు, పీసీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనాయణరెడ్డి, నాయకులు అప్పారావు, సురేష్, బుచ్చాలు, శ్రీనివాసరెడ్డి, వేణు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రాఖీ పౌర్ణమి లక్కీడ్రాకు స్పందన



వైరా: లక్కీడిప్ బాక్సులో టికెట్లను వేస్తున్న మహిళలు

వైరా/సత్తుపల్లిటౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా టీఎస్ ఆర్టీసీ ఎండి సజ్జనార్ ప్రకటించిన లక్కీ డ్రాకు మహిళల నుంచి స్పందన లభిస్తుంది. బుధ, గురువారాలలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణీకులు టిక్కెట్ల వెనుక పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్‌లోని లక్కీడిప్ బాక్స్‌లో వేసి నట్లైతే లక్కీడ్రా తీస్తామని అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో సత్తుపల్లి, వైరా ఆర్టీసీ బస్టాండ్‌లోని లక్కీడిప్ బాక్స్‌లో బుధవారం టిక్కెట్లు వేసేందు మహిళా ప్రయాణీకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం, ఆర్టీసీ సిబ్బంది కిన్నెర ఆనంద్, బాలస్వామి, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. 1.25 లక్షల సాయం

కారేపల్లి: కారేపల్లి మండలం మల్లన్నగూడెం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మూతి చంద్రశేఖర్–శిరీష దంపతుల కుమారుడు డేవిడ్ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారు నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఖమ్మం, హైదరాబాద్ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం రూ.1.25 లక్షల ఆర్థిక సాయం అందించారు. చికిత్స సమయంలో.. వారికి వైరా మాజీ ఆత్మకమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ రూ.40 అందించి తన ఉదారతను చాటుకున్నాడు. కార్యక్రమంలో హాస్టల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్, వెంకటప్పారావు, ఖమ్మం హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సభ్యులు ప్రభాకర్, శ్రీనివాసరావు, సుమన్, నిర్మల, వసంత, రాజమ్మ, కరుణశ్రీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు: అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కల్లూరు ప్రాజెక్ట్ పరిధిలోని 200 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు.. వెంకటేశ్వరరావు సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 11నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తాన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉమా విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడు సీహెచ్ విఠల్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమ్య, సుధారాణి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాల్లో పాల్గొనండి

సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 7 వరకు చేపట్టే నిరసన కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని సీపీఎం మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం సదాశివునిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించటంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో బండి వేలాద్రి కృష్ణ, మారేశ్వరి, పద్మ, నాగేష్, శ్రీదేవి, కుమారి, లక్ష్మీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో పల్టీ.. ఐదుగురికి తీవ్ర గాయాలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం కిష్టారం నుంచి అన్నపురెడ్డిపల్లికి వెళ్తున్న ఆటో జగన్నాధపురం మలుపు వద్ద పల్టీ కొట్టింది. 12 మంది ప్రయాణీకులతో వెళ్తున్న ఈ ఆటోలో శ్రీను, నాగమణి, శరణ్య, కల్యాణి, కోమలిలకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పర్సు అందజేత

ముదిగొండ: ఆటోలో పర్సు మరిచిపోయిన ప్రయాణికురాలికి తిరిగి పర్సు అందజేసి ముదిగొండ ఆటో డ్రైవర్లు నిజాయితీని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కూసుమంచి మండలం జీళ్లచెరువుకు చెందిన ఓ మహిళ ముదిగొండ నుంచి బాణాపురం వెళ్లడానికి బుధవారం ఆటోలో కూర్చొంది బస్సు రావడంతో ఆటోలో నుంచి దిగి మహిళ బస్సు ఎక్కింది. బస్సు సువర్ణాపురం క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లే సరికి పర్సు ఆటోలో మరిచిపోయినట్లు గుర్తించింది. ముదిగొండకు వచ్చిన మహిళకు ఆటో యూనియన్ ప్రతినిధులు పర్సు అందించారు.

గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ, మల్లారం, వల్లబి, గంధసిరి, వల్లాపురం గ్రామాల్లో ఎంపీడీఓ అశోక్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. పల్లెప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లులో సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలించారు. గ్రామపంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల అరెస్ట్



ఏన్కూరు: పోలీస్‌స్టేషన్‌లో బీఎస్పీ నాయకులు

ఏన్కూరు/ఎర్రుపాలెం/ముదిగొండ : సూర్యాపేటలో జరిగే మహాధర్నాకి బుధవారం వెళ్తున్న బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఏన్కూరులోని బీఎస్పీ నాయకులను, ఎర్రుపాలెంలోని స్థానిక పార్టీ నియోజకవర్గ బాధ్యులు గద్దల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గట్టిగుండె యాకోబు, విఘ్నేశ్వరిలను, ముదిగొండలోని బీఎస్పీ జిల్లా నాయకుడు పల్లెపొంగు విజయ్‌కుమార్‌ను ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తీరును ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంగళ నరేష్, సత్యం, కోటయ్య పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

సత్తుపల్లిరూరల్: సూర్యపేట డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్‌పై ఒకేరోజు పెట్టిన 76 అక్రమ కేసులను ఎత్తివేయాలని యాదవ సంఘం జిల్లా నాయకులు మల్సూర్, మేకల నాగేశ్వరరావులు అన్నారు. బుధవారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రశించే గొంతులను నొక్కివేయడం సరికాదని.. జానయ్యపై పెట్టిన కేసులు ఎత్తివేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం సత్తుపల్లి పట్టణ, మండల నాయకులు బాబు, రాజు, వెంకటేశ్వరరావు, గోపాలరావు, నర్సింహారావు, అప్పారావు, రాంబాబు, రామకృష్ణ, కార్తీక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

బోనకల్: గత ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేయాలని టీడీపీ నాయకులు బుధవారం తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శివలానాయక్, కోటేశ్వరావు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ గణేష్

మధిర: ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని ఖమ్మం ఆర్డీఓ గణేష్ తెలిపారు. బుధవారం మధిర ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఓటు విలువను తెలుసుకుని ఓటు హక్కు కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏఎల్ఎన్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయదాసు, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, లియో క్లబ్ కో–ఆర్డినేటర్ ఇందిర, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సుజాత, జూనియర్ కళాశాల కో–ఆర్డినేటర్ తావూర్యా పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి మారాలి



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి మారాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ అన్నారు. బుధవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులను అప్పులు పాలు చేస్తున్నాయన్నారు. కార్మికులకు రావాల్సిన మెనూ చార్జీలు, కోడిగుడ్ల బిల్లులో, గౌరవ వేతనాలు గత పది నెలలు నుంచి అరకొరగా ఇవ్వడంతో కార్మికులు కిరణా సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు దుకాణాల వద్ద అప్పులు తెచ్చి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే వంట గ్యాస్ ధరలు అకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వం వంటగ్యాస్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పెరిగిన ధరలకు అనుగుణంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు కుంట వెంకమ్మ, ప్రధాన కార్యదర్శి లక్ష్మి, సీతమ్మ, మహాలక్ష్మి, శ్యామల, రత్నకుమారి, చంటమ్మ, కృష్ణవేణి, కనకదుర్గ పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న బూసా కోటేశ్వరరావు

మధిర: సమాజంలో కృష్ఠువ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మడుపల్లి హైస్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ వలీ, సీనియర్ ఉపాధ్యాయుడు బూసా కోటేశ్వరరావు కోరారు. దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి కుష్ఠువ్యాధి మచ్చల సర్వే చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి లెప్రసీ, ఫైలేరియా జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రముఖ జానపద కళాకారుడు లంకా కొండయ్య తన కళా నైపుణ్యంతో జానపద, ఆరోగ్య గీతాలను ఆలపించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లీల, నాగేశ్వరరావు, ఆశ కార్యకర్తలు అంజమ్మ, నిర్మల, అరుణ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



ఏన్కూరు: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ

ఏన్కూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షకాలంలో సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, అంగన్‌వాడీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చిన్నారులకు క్రమం తప్పకుండ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అమరనేని సుశీల, ముదిగొండ అరుణ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారిచండి..

వేంసూరు: గ్రామాల్లో జ్వరాల బాధితులు పెరుతున్న దృష్ట్యా పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ రంజిత్ కుమార్ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. దోమల నివారణకు దోమల మందు పిచికారీతో పాటు బ్లీచింగ్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెట్టుకు రాఖీ కట్టిన చిన్నారులు



చెట్టుకు రాఖీ కడుతున్న అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు

తల్లాడ: పర్యావరణ పరిరక్షణలో చెట్ల పాత్ర చాలా ముఖ్యమని అంగన్‌వాడీ టీచర్ పద్మ అన్నారు. బుధవారం మండలంలోని అన్నారుగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వృక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తయారు చేసిన పర్యావరణహితమైన రాఖీని టీచర్ పద్మతో కలిసి చిన్నారులు ఆవరణలోని చెట్లకు కట్టారు. అనంతరం మొక్కలు నాటి.. చెట్లపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులు పచ్చదనం పరిడవిల్లేలా ఆకుపచ్చ రంగులో ఉన్న యూనిఫాం దరింపజేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ ముత్యాలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్..

మధిర: ఆత్కూరు సమీపంలోని శ్రీనిధి పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు.. విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అంజన్ బాబు, పాఠశాల డైరెక్టర్ చందు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల రాఖీ ప్రదర్శన..



రాఖీ ఆకారంలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఏన్కూరు : మండలంలోని రాయమాదారం ప్రాథమికోన్నత పాఠశాలలో రాఖీ పండుగ సందర్భంగా విద్యార్థులు బుధవారం వినూత్న ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు అందరు రాఖీ ఆకారంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అలవేలు, సోమ్లా, నాగేశ్వరరావు, పీఈటీ శోభన్ పాల్గొన్నారు.

గొల్లెనపాడులో పశువైద్య శిబిరం

వైరారూరల్: మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, గోపాలమిత్ర ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 28 గేదెలకు గర్భకోశ వ్యాధి, 14 గేదెలకు సాధారణ వైద్య పరీక్షలు, 36 గేదె దూడలకు నట్టల మందులను పంపిణీ చేశారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ టి.లక్ష్మణాచారి, రెబ్బవరం జేవీఓ రామలింగస్వామి, గోపాలమిత్రులు సుభాని, ఖాసీం సాహెబ్, వెంకయ్య, నరేష్, సమద్‌మియా, ప్రభాకర్, కృష్ణ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సేవాసదనం ఖమ్మంకు తరలింపు

మధిర: మధిర పట్టణంలోని మానసిక వికలాంగుల సేవాసదనాన్ని ఖమ్మంకు తరలించడం జరిగిందని సేవాసదనం నిర్వాహకురాడు డాక్టర్ షీలారామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిరలో డాక్టర్ జి.వసంతమ్మ సుమారు మూడు దశాబ్దాల క్రితం స్థాపించిన సేవాసదనం, ఇప్పటి నుంచి ఖమ్మం శాంతి నిలయం ఆశ్రమంలో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇకపై వారి బాధ్యతలను తానే తీసుకుంటున్నటు ఆమె తెలిపారు. మధిరలోని సేవాసదనంలో సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు. అయితే గంతలో వసంతమ్మ సేవాసందనంలో పనిచేసిన సిబ్బంది స్వచ్ఛందంగా సేవాసదనం ఏర్పాటు చేసి తమ పేరుతో చలామణి అయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

మధిరలో కొనసాగే సేవాసదనానికి, తమకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. మాకు బ్రాంచ్‌లు ఎక్కడా లేవని, అదనపు సమాచారం కోసం నం. 9440048789 ను సంప్రదించాలని సూచించారు.